బాధితురాలికి ఎమ్మెల్సీ చల్లా పరామర్శ

బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, మార్చి 6 : అనారోగ్యంతో బాధప డుతున్న హుస్సేన్ బీని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. గురువారం మండలంలోని బైనపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ముఖ్తార్ మాతృమూర్తి హుస్సేన్ బీ అనారోగ్యంతో బాధప డుతున్న విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి ఆమెతోనే యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి వావిలాల రంగారెడ్డి, మాజీ ఎంపీపీలు, సుందర్‌రాజు, ప్రహ్లాదరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకాపురం రాముడు, నాయకులు నర్సింహారెడ్డి, సత్యారెడ్డి, వెంకటేశ్, రవిరెడ్డి, రమేశ్ ఉన్నారు.

సమయం పాటించని పంతుళ్లు

- బడిబయటే విద్యార్థులు

తెరుచుకోని పాఠశాల గది

ధరూరు, మార్చి 6 : సమయం పాటించని ఉపాధ్యాయులతో విద్యార్థులు స్కూల్ బయటే వేచి చూడాల్సి వచ్చింది. మండలంలోని పెద్దపాడు ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఒక్కరూ గురువారం సెలవు పెట్టుకోస్నారు. కాగా మరోక ఉపాధ్యాయుడు ఉదయం 9:30గంటలైన పాఠశాలకు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల ఎదుట వేచి చూసే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితి ప్రతినిత్యం ఇలానే కొనసాగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈవోను వివరణ కోరగా ఏమో నాకు కూడా తెలియదు, బుధవారమే నేను అదే స్కూల్‌ను విజిటింగ్ చేశాను. ఒకవేళ ఉపాధ్యాయులు సెలవు లెటర్ ఏమైనా పెట్టి ఉండవచ్చు అందుకే అలా జరిగి ఉంటుందని తెలిపారు. ఏది ఏమైనా ఇద్దరిలో ఎవరో ఒక ఖైనా సమయానికి రావాల్సిందే, జిల్లాకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాల పరిస్థితే ఇలా ఉంటే ఇంక మారుమూల గ్రామంలో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు అందోళన వ్యక్తం చేశారు.

రెండో రోజు ప్రశాంతం

గద్వాలటౌన్/అమరచింత/అయిజ/గట్టు, మార్చి 6 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రెండో రోజు ప్రశాంతగా సాగాయి. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకాగా మొదటి రోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 3,027 మంది విద్యార్థులు పరీక్షా రాయాల్సి ఉండగా 2,945 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో ప్రభుత్వ విద్యార్థుల తోపాటు ప్రైవేట్ విద్యార్థులు 82మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 658 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 20మంది గైర్హాజరు కాగా 638మంది పరీక్షకు రాశారు. ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి హృదయరాజు జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అదేవిధంగా వనపర్తి జిల్లా అమరచింతలో నిర్వహిస్తున్న రెండు పరీక్షా కేంద్రాల్లో 26 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. అయిజ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, హరిహర, అరోరా జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, అరబిక్ సబ్జెక్టు పరీక్ష నిర్వహించారు. మూడు పరీక్షా కేంద్రాలకు 603 మంది విద్యార్థులను కేటాయించగా, 583 మంది హాజరుకాగా, 20 మంది గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు రాములు, రంగన్న, రామచంద్రయ్య తెలిపారు. గట్టులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జనరల్‌కు సంబంధించి 277 మంది విద్యార్థులకుగానూ 271మంది, ఒకేషనల్‌కు సంబంధించి 60మంది విద్యార్థులకు 52మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. రెండో రోజు పరీక్ష సజావుగా జరిగినట్లు సీఎస్ కేహెచ్‌డీ రాజు, డిపార్ట్‌మెంటల్ అధికారి కాశీవిశ్వనాథ్ తెలిపారు.

132 మంది విద్యార్థులు గైర్హాజరు

వనపర్తి టౌన్, మార్చి 6 : జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని మొత్తం 25పరీక్ష కేంద్రాల్లో మొత్తం 5,795 మంది విద్యార్థులకు 5,663 మంది హాజరవ్వగా 132 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో అంజయ్య తెలిపారు. అందులో జనరల్ విభాగంలో 4,841 మందికి 4,745 మంది విద్యార్థులు హాజరవ్వగా 96 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 954 మందికి 918 మంది విద్యార్థులు హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్, మార్చి 6 : ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగనున్న పద్మశాలీ అఖిల భారత 17వ మహాసభలను విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘం నాయకులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మార్చి9న నిర్వహించిన పద్మశాలీ అఖిల భారత మహాసభలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని వారు చెప్పారు. వనపర్తి జిల్లాలోని పద్మశాలీ సంఘం నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్న పద్మ, రాజు, కరుణాకర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

DOCUMENT MISSING
నేను అనగా, భాగ్యలక్ష్మి D/o వెంకటేష్, 40 సం॥ H.No.3-65, కారుకొండ గ్రామం, నవాబ్‌పేట్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ నుండి కారుకొండ గ్రామంకి బస్సులో వెళుతుండగా సర్వే నెంబర్ 648 ప్లాట్ నెంబర్ 26 గల నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ పడిపోయినవి ఎవరికైనా దొరికినచో క్రింది నెంబర్‌కి సంప్రదించండి.
CELL NO: 9866606834

PLOT FOR SALE
★300 Sq.Yards Plot having High-tension Power Line with East Face at Marlu, MBNR, Rs. 18L. 9700678568.
NT-09423

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కావలెను
★ గద్వాల్ నగరంలోని కాసం ఫ్యాషన్స్‌లో పని చేయుటకు సారీస్ సూపర్‌వైజర్ మరియు సేల్స్ మెన్స్ కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత, ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర: సెల్: 9701678319/7396629400
NTW-17520

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

రోగాలు దరిచేరకుండా కాపాడుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మార్చి 6 : మహిళలు ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించి క్యాన్సర్ వంటి రోగాలు దరిచేరకుండా కాపాడుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని నర సింగాయపల్లిలో ఉన్న ఎంసీహెచ్‌లో మహిళా సిబ్బందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించి క్యాన్సర్ వంటి రోగాలు దరిచేరకుండా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మన ప్రభుత్వ దవాఖానలో అనేక రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అనేది ప్రధాన సమస్యగా మారిందని, దీన్ని ముందుగానే గుర్తించడం ద్వారానే అరికట్టడం సాధ్యమని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో పీహెచ్‌సీ స్థాయిలోనే మంచి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఎన్ఆర్‌సీ సెంటర్ ద్వారా 400 మంది సామ్, మామ్ పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచినట్లు చెప్పారు. నర్సింగాయపల్లి ఎంసీహెచ్ ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులను కలెక్టర ఆదర్శ్ సురభి పరిశీలించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కొత్తకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును, పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించారు.

చర్యలు తీసుకోవాలి

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉపాధిహామీ పనులు, బ్యాంకు లింకేజీ రుణాల అంశాలపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఎంలతో మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికై మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. లబ్ధిదారులందరికీ ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. అన్ని మండల కేంద్రాల్లో వేగంగా ఇందిరమ్మ ఇల్లు నమూనా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభానికి నోచుకొని మండలాల్లో స్థలాలు గుర్తించి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రాబోయే రెండు మూడు రోజుల్లో అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్, గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్వతాలు, విరోబా, ఎంపీడీవోలు, ఏపీఎంలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి, ఎంసీడీ ప్రోగ్రాం అధికారి రామచందర్, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, చీఫ్ సూపరింటెండెంట్, అధికారులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆయుధాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తిటౌన్, మార్చి 6 : పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ ఏడాది ఫైరింగ్ ప్రాక్టిస్ మూడు రోజులపాటు నిర్వహించారు. ఈ ఫైరింగ్ ప్రాక్టిస్‌లో పోలీసులు వారి విధుల్లో విని యోగించే ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టిసులో చేయించారు. ఒక్కొక్కరికీ పది రౌండ్లు చేసే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా సాయుధలాల అదనపు ఎస్పీ, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫైరింగ్ చేసి ఆయుధాల నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు. ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టీసులో ఉత్తమ ప్రతిభ కనబర్చగా ఫైరింగ్‌లో ప్రతిభను కనబ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్రపరుచుకోవాలని ఆదేశించారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని జిల్లా, తెలంగాణ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్డీ ఎస్పీ ఉమామహేశ్వరరావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పల నాయుడు, శ్రీనివాస్, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు వినోద్, ఎండీ మగ్దంబారీ, జిల్లాలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా కేంద్రాలు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల తోపాటు ఇతర పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరీక్షా కేంద్రాల నిర్వాహకులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు, సలహాలు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సై హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

అమరచింత, మార్చి 6 : ఆత్మకూర్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో నేరాల ఆదుపునకు పోలీసులు చేపట్టనున్న చర్యలపై ఆత్మకూర్ సీఐ శివకుమార్‌తోపాటు అమరచింత, ఆత్మకూర్, మాదనపూర్ ఎస్సైలకు ఎస్పీ రావుల గిరిధర్ పలు సూచనలు చేశారు. గురువారం ఆయన ఆత్మకూర్ పోలీసుస్టేషన్‌ను అకస్మికంగా సందర్శించి ఆత్మకూర్ పట్టణంలో ఈమధ్యకాలంలో జరిగిన పందుల చోరీపై విచారణ ఏంత వరకు వచ్చిందని ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది. అనంతరం పలు కేసుల పురోగతిని తెలుసుకుని రిజిస్టర్లను పరిశీలించారు. ఎస్పీ రావుల గిరిధర్ సందర్శనపై ఆత్మకూర్ సీఐ శివశంకర్‌ను వివారణ కోరగా వార్షిక సందర్శనలో భాగంగానే ఆత్మకూర్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసినట్లుగా సీఐ వివారణ ఇచ్చారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అలంపూర్ చౌరస్తా, మార్చి 6 : తుంగభద్రనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం కర్నూల్ జిల్లా పంచలింగాల సమీపంలోని తుంగభద్రనది నుంచి టిప్పర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అలంపూర్ చౌరస్తా సమీపంలో పోలీసులు పట్టుకుని ఉండవల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం టిప్పర్ డ్రైవర్ రాజేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్, మార్చి 6 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదువుతున్న విద్యార్థినులపై దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు చిన్ననాగన్న, రఘురామ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం అఖిల భారతీయ విద్యార్థిపరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు అర్జున్‌లతోపాటు ఆ సంఘం నాయకులు మండల విద్యాధికారి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు విద్యార్థినుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని కొద్దిసేపు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర నాయకులు అర్జున్ మాట్లాడుతూ క్లాస్‌రూంలలో ఉపాధ్యాయులు విద్యార్థినులపై అసభ్యకరమైన చేష్టలకు పాల్పడడం విచారకరమని పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తగిన రక్షణ చర్యలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వంశీ, శ్రీకాంత్, వంశీ నాయుడు, శరత్, రాకేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు వసంత

అమరచింత, మార్చి 6 : సీజనల్ వ్యాధుల పట్ల వసతిగృహం విద్యార్థులు ఎప్పటికప్పుడు శుభ్రత పటిస్తూ అప్రమత్తంగా ఉండాలని తిప్పుడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వసంత సూచించారు. గురువారం ఆత్మకూర్ పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో ఉన్న ఎస్సీ వసతిగృహంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు వసంత మాట్లాడుతూ వసతిగృహం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఎక్కడ నిల్వనీరు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అంటూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ బేనర్జీ, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా వృషభరాజముల పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేత

బండలాగుడు పోటీలో తలపడుతున్న ఎడ్లు

రాజోళి, మార్చి 6 : మండల కేంద్రంలో అంతరాష్ట్ర సీనియర్ విభాగం వృషభరాజముల పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. పోటీలను మాజీ ఉప సర్పంచ్ దస్తగిరి ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జతల వృషభరాజములు పాల్గొనగా అందులో పల్కందొడ్డికి చెందిన ఖాజా ఎద్దులు 2,593 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలవగా పీఆర్‌పల్లికి చెందిన నాగయ్య ఎద్దుల జత రెండో స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోగులాంబ ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్‌రెడ్డి, గంగ్గి రెడ్డి, ఎల్లారెడ్డి, సీతారామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, హసన్, నాగరాజు, దేవేంద్ర, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కుర్వ కిష్టన్న, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, మార్చి 6 : సాంప్రదాయ చేతివృత్తుల వారు ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు రూపొందించిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతరించి పోతున్న చేతి, కులవృత్తుల వారికి చేదోడు, వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే వారిలో సామర్థ్యాన్ని పెంచి నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉత్పాదకత, నాణ్యత ఉత్పత్తులను మెరుగు పరిచి ఆర్థికంగా చేయూత నిస్తూ జీవనోపాధిని అభివృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యమని తెలిపారు. కేంద్రప్రభుత్వం కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంపాలి, చాకలి, మంగలి, ఉప్పరి, ఎరుకలి, దర్జీ తదితర 18కుల వృత్తుల వారికి సూక్ష్మ, చిన్న మధ్యతరహా వ్యాపారాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు శిక్షణతో పాటు రుణాలు అందజేస్తామన్నారు. విశ్వకర్మగా పేరు నమోదు కోసం సమీపంలో కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో రేషన్ కార్డు, ఆధార్‌కార్డ్, బ్యాంక్‌పాస్‌బుక్, మోబైల్ నెంబర్‌తో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైనా వారికి రెండు రకాలుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రాథమిక నైపుణ్యం ద్వారా ఐదు నుంచి ఏడు రోజులు, అధునాతన నైపుణ్యానికి 15రోజుల శిక్షణ అందిస్తూ శిక్షణ కాలంలో ప్రతిరోజూ రూ.500 భృతి ఇవ్వడంతోపాటు, శిక్షణ అనంతరం రూ.15వేల విలువైనా టూల్ కిట్స్, ధ్రువీకరణ పత్రం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. రెండు విడుతలుగా మొత్తం రూ.3లక్షల బ్యాంక్ రుణం అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులైనా రామలింగేశ్వర గౌడ్, శివరామ్‌ప్రసాద్, సంజీవ్‌కుమార్‌సైని, నాగేంద్రం, రమేశ్‌బాబు, గోవిందయ్య, అయ్యపురెడ్డి పాల్గొన్నారు.

జనరల్ దవాఖానలో డీఎంఈ డైరెక్టర్ తనిఖీ

దవాఖానను పరిశీలిస్తున్న డీఎంఈ డైరెక్టర్

గద్వాల టౌన్, మార్చి 6 : జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ దవాఖాన గురువారం డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలోని జనరల్ వార్డులను, చిన్న పిల్లల వార్డును, టీహబ్, రేడియోషన్ డిపార్ట్‌మెంట్‌తోపాటు వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. అలాగే ఓపీ, పరిసర ప్రాంతాలను, సంగాల పార్కు వద్ద ఉన్న మెడికల్ కళాశాలను సందర్శించి పరిశీలించారు. నిబంధనల మేరకు కళాశాలను స్వాధీనం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పార్వతికి ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ ఇందిర, పరిపాలనాధికారి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్లు, అధికారులు ఉన్నారు.

రేషన్ బియ్యంలో పోషకాలు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ తాసీల్దార్ ప్రశాంత్ గౌడ్

అయిజ, మార్చి 6 : పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక పదార్థాలు అధికంగా ఉన్నాయని, లబ్ధిదారులు రేషన్ బియ్యంను తప్పని సరిగా తీసుకుని తినాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ తాసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 3,8,5,12,13,43 రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రేషన్ బియ్యంలో విటమిన్ బీ 12 వరకు ఫోరికామ్లం, ఐరన్ వంటి ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. రేషన్ బియ్యాన్ని తిని ఆరోగ్యం తమంగా ఉండాలని సూచించారు. రేషన్ డీలర్లు సమయ పాలన పాటించి లబ్ధిదారులకు బియ్యంను అందించాలని ఆదేశించారు. బియ్యం నిల్వల్లో తేడాలోస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

గద్వాల అర్బన్, మార్చి 6 : తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. జిల్లా కేంద్రంలోని రాజా నగర్ కాలనీలో బంగారు వ్యాపారి సంజీవ్ కుమార్ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ ఫంక్షన్ వెళ్లారు. ఇంట్లో ఎవరులేని సమయం చూసిన గుర్తు తెలియని దుండగులు పట్టపగలే ఇంటి తాళంను పగలకొట్టి ఇంట్లోకి చొరబడి 7 తులాల బంగారం, 5కేజీల వెండి, రూ.1.30లక్షల నగదును అపహరించికు పోయారు. అనంతరం సంజీవ్ సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలకొట్టి ఉండడంతో వెంటనే గద్వాల టౌన్ పోలీస్‌లను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో ఎస్సై కళ్యాణ్‌కుమార్ కేసునమోదు ఘటన స్థలంకు చేరుకొని దొంగతనంపై ఆరా తీశారు.

దగ్